పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

బియ్యం పట్టివేత

పెంచికల్‌పేట, జనవరి10 : మండలంలోని కొండవెల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రాయితీ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు. తనకు అందిన సమాచారం మేరకు టాస్కఫోర్స్ ఎస్ఐ సందీప్‌తో కలిసి ఎల్కరి శేఖర్ ఇంట్లో తనిఖీ చేయగా మూడు క్వింటాళ్ల బియ్యం లభించాయన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క ఫోర్స్ ఏఎస్ఐ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వికీపీడియా వార్షికోత్సవానికి ఆహ్వానం

కవి ఆత్రం మోతీరాం

వాంకిడి,జనవరి 10 : మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన నగర్‌గుట్ట గ్రామనికి చెందిన కవి, రచయిత, వికీపీడియాన్ ఆత్రం మోతీరాంకు తెలుగు వికీపీడియా నుంచి ఆహ్వానం అందుకున్నారు. ఈ నెల 26 నుంచి 28 వరకు విశాఖపట్నంలో జరిగే తెలుగు వికీపీడియా వార్షికోత్సవానికి ఆహ్వానం రావడం సంతోషంగా ఉందని ఆత్రం మోతీరాం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తెలుగు వికీపీడియాలో వ్యాసాలు రాయడం,కొలాం సంస్కృతికి సంబంధించిన ఛాయా చిత్రాలను పొందుపర్చడం వంటి కృషికి ఆహ్వానం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా బోలి చేతో ఫౌండేషన్ సీఈవో నేతి సాయికిరణ్, కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి,ఆత్రం భీంరావు,వసంత్ రావులు అభినందించారన్నారని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ పవన్

వాంకిడి, జనవరి 10: తెలంగాణలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఖమాన సర్పంచ్ పెందోర్ పవన్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని లింబారావుగూడలో జైహనుమాన్ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కబడ్డీ పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల్లో గెలు పోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని సర్పంచ్ తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- రోడ్ల నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు తయారు చేయండి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం, జనవరి10 : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఎంపీపీ కంభగౌని సులోచన అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైద్యంపై చర్చ నిర్వహించగా ఇన్‌చార్జి మండల విద్యాధికారి భిక్షపతి విద్యాశాఖకు చెందిన నివేదికలను చదివి వినిపించారు. పంచాయతీరాజ్‌శాఖ పై చర్చ నిర్వహించగా ఏఈ ఆత్మరాం మాట్లాడుతూ ఎస్‌డీఎస్ నిధులు ప్రతి పంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయని కానీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. అదేవిధంగా మండలంలో 6 పంచాయతీలకు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా స్థలం కేటాయించని కారణంగా నిర్మాణ పనులను చేపట్టలేక పోయామన్నారు. మిషన్‌భగీరథపై చర్చ నిర్వహించగా డీఈ సిద్దిక్ మాట్లాడుతూ, విషన్ భగీరథ నివేదికలను చదివి వినిపించగా రావులపల్లి, దిగడ గ్రామాల్లో పైపులైన్‌లు సరిగా లేనందున అక్కడ కొన్ని వాడలకు నీరు అందదడం లేదని సర్పంచ్ జిల్లేల వెంకటేశ్, జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారావులు అన్నారు. పైపుల లైన్ల నిర్మాణనాకి నిధులు లేవని డీఈ తెలుపడంతో జడ్పీ ఫండ్ నుంచి నిధులు ఇస్తామని సమస్యను పరిష్కరించాలని జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. అదేవిధంగా వ్యవసాయం, ఉద్యానవన, రెవెన్యూ,ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ, వైద్యం తదితర శాఖలపై చర్చ నిర్వహించారు. మండలంలోని పలు కొత్తరోడ్లు, వంతెనలు,రెన్యూవల్ బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టాలని జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ముఖ్యంగా అటవీశాఖ అనుమతుల కారణంగా నిర్మాణాలు జరుగడం లేదన్నారు. మండలంలో కూడా అటవీశాఖ అనుమతుల కారణంగా ఖర్జీనుంచి మొట్లగూడ వరకు, కల్వాడ నుంచి కొంచవెల్లి వరకు రోడ్లనిర్మాణం జరుగడం లేదన్నారు. అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు తీసుకునేందకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రులతో మాట్లాడి రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకువచ్చి నిర్మాణాలు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.అధికారులు రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అధికారులు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ, మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కంభగౌని సులోచన, జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారావు, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజం

బదిలీపై వెళ్తున్న సీఐ రమేశ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 10 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిజర్వ్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రమేశ్ బదిలీపై మహబూబ్‌నగర్ వెళ్తున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సీఐ రమేశ్‌ను ఎస్పీ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఉద్యోగంతో పాటు వ్యక్తిగత జీవితంపై దృష్టిసారించాలన్నారు. ఉద్యోగం ఎక్కడ చేసినా క్రమ శిక్షణతో విధులు నిర్వహిం చాలని సూచించారు. డీపీవో ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐలు రాజు, ముత్యం రాజు, ఆర్ఐలు పెద్దన, అం జన్న, కిరణ్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం

బెజ్జూర్, జనవరి 10 : మండల కేంద్రంలో బుధవారం పీఆర్టీయూ నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా అరుణ, మండలాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, రవీంద్ర, లావణ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా ప్రియాంక, మీడియా కన్వీనర్‌గా రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 317 జీవో బాధితులు అధ్యక్ష, కార్యదర్శులకు వినతపత్రం అందజేశారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా శ్యాం సుందర్, తిరుపతి వ్యవహరించారు.

వార్షిక క్రీడా పోటీలు

సిర్పూర్(టీ), జనవరి 10 : మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడాపోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే క్రీడా పోటీలను ఎస్ఐ దీకోండ రమేశ్ ప్రారంభించారు. ఆనంతరం మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బైజుజాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్పాహారాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో పార్థి అశోక్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 10 : అల్పాహార పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో పార్థి అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గుండి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అల్పాహారం, విద్యార్థుల ఫేస్ రికగ్నేషన్ సిస్టంను ఆయన పరిశీలించారు. పథకానికి సం బంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేయాలని డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు. పలువురు విద్యార్థులను ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్ ఉన్నారు.

వేబ్రిడ్జి సేవలను సద్వినియోగించుకోవాలి

వేబ్రిడ్జి కాంటా గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్, జనవరి 10: పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో ప్రారంభించిన కంప్యూటరైజ్డ్ వేబ్రిడ్జి కాంటాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి కబడ్డీ పోటీల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కెరమెరి, జనవరి 10: మండలంలోని సాకడ(శ్యాంరావుగూడ) గ్రామంలో నిర్వహించే కబడ్డీ ఆటల పోటీల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మిని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 13 నుంచి ఓం జై శ్రీ బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే స్వర్గీయ పెందోర్ జంగు పటేల్ స్మారక కబడ్డీ 24వ క్రీడోత్సవాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, నిర్వహణ కమిటీ సభ్యులు పెందోర్ శ్రీనివాస్, సెడ్మాకి తుకారాం, మడావి సోము తదితరులు ఉన్నారు.

పాట్నాపూర్‌లో భీమయ్యక్ స్వామి జాతర

చిన్న పాట్నాపూర్‌లోని శ్రీశ్రీశ్రీ ఓం రాజ్ వంగేపురి భీమయ్యక్ స్వామి

కెరమెరి, జనవరి 10: మండలంలోని చిన్నపాట్నాపూర్‌లో 14 నుంచి శ్రీశ్రీశ్రీ ఓం రాజ్ వంగేపురి భీమయ్యక్ స్వా మి జాతర ఉంటుందని నిర్వాహకులు ఆత్రం ధర్మ, ఆత్రం ముత్త, సోనేరావ్ తెలిపారు. 3 రోజుల పాటు జరిగే జాతరలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమబహుమతి రూ.6, 201,ద్వితీయబహుమతి రూ. 4,201,తృతీయబహుమతి రూ.2,201, నాలుగో బహుమతి రూ.1,201 నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు రూ.351ల ప్రవేశ రుసుం చెల్లిం చి పోటీల్లో పాల్గొన్నాలని వారు కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

తిర్యాణి, జనవరి 10: మండలంలోని మాణిక్యపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజ్‌గూడ శివారులో గత శనివారం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు బుధవారం తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెబ్బెన సీఐ అల్లం నరేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 5న మృతుడు తిరుపతి, తన పంట చేనులో కావలికి వెళ్లగా పథకం ప్రకారం ఐదుగురు వ్యక్తులు హత్య చేశారని సీఐ తెలిపారు. రాజగూడ గ్రామానికి చెందిన మృతుడు తిరుపతి కొన్ని రోజులుగా గ్రామంలోని వారితో సఖ్యంగా ఉండడం లేదన్నారు. నిందితుల్లోని ఒకడైన నగేశ్ తండ్రి మారుతి ఆ గ్రామానికి పటేల్‌గా వ్యవహరిస్తున్నాడు. మారుతికి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగు లేకపోవడంతో తిరుపతియే మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో నిందితుడు నగేశ్ తన బంధువులైన జుగ్గుక హీరామన్, చిక్రం మారుతి, హర్ష వర్ధన్, ఆత్రం చిన్నుల సహాయంతో తిరుపతిని హత్య చేశారని తెలిపారు. నిందితులు ఉపయోగించిన గొడ్డలితోపాటు హత్య చేసేటప్పుడు ఉపయోగించిన టార్చ్ లైట్ మృత్యుని మొబైల్ ఫోన్‌తో పాటు మరో మొబైల్ ఫోన్‌ను స్వాధినం చేసుకొని నిందితులను రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. హత్య కేసును త్వరతగతిన ఛేదించిన తిర్యాణి ఎస్ఐ రమేశ్‌తో పాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. ఇక్కడ హెడ్ కానిస్టేబుల్‌లు ప్రభాకర్, రవీందర్, కానిస్టేబుల్ శంకర్, రాజ్‌కుమార్, సిబ్బంది జంగు, తుకారాం టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ పింఛన్ నిలిపివేయాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 10 : కాగజ్‌నగర్ మండలంలోని బారేగూడ గ్రామానికి చెందిన ఓ మహిళ అక్రమంగా పింఛన్ పొందుతున్నదని అట్టి పింఛన్‌ను వెంటనే నిలిపివేయాలని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా ప్రభుత్వ పింఛన్ పొందడంతో గతంలోనే ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని, ఫిర్యాదుతో విచారణ చేపట్టడంతో అక్రమ పింఛన్‌గా తేలినప్పటికీ అట్టి పింఛన్‌ను ఎంపీడీవో నిలిపివేయడం లేదని పేర్కొన్నారు. పూర్తి విచారణ జరిపి అక్రమ పింఛన్ నిలిపి వేయాలని, అక్రమ పింఛన్ అందిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

క్యాంప్‌లను సద్వినియోగించుకోవాలి

రెబ్బెన, జనవరి 10: కోలాంల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందడం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న క్యాంప్‌లను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని రెబ్బెన ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్, తహసీల్దార్ సమీర్‌లు పేర్కొన్నారు. మండలంలోని సోనాపూర్ దగ్గరలోని కోలాంగూడ, ఖైర్‌గూడ గ్రామపంచాయతీలోని కోలాంగూడ, గోలేటి గ్రామ పంచాయతీలోని రేకులగూడ గ్రామాల్లో బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, కులం, నివాసం, ఇన్‌కం, చిన్ని పిల్లలకు బర్త్ సర్టిఫికెట్స్ అన్ని అందించడం కోసం గ్రామాల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపులు ఏర్పాటు చేయటంతో పాటు అన్ని సర్టిఫికెట్స్ కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఆర్ఐ ప్రేంకుమార్, పంచాయతీ కార్యదర్శులు జలంధర్, మీనాక్షిలతో పాటు పలువురు ఉన్నారు.

పోరు గర్జన సభను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 10 : టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29న హైదరాబాద్ పట్టణంలోని ఇందిరా పార్కులో నిర్వహించే పోరు గర్జన మహాసభను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి పిలుపునిచ్చారు. బుధవారం పోరు గర్జన సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లతో నిర్వహించే పోరుగర్జన మహాసభ కార్యక్రమానికి జిల్లా నుంచి టీఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్, వినోద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 10 : జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ పాఠశాల మైదానంలో రెండు రోజుల క్రితం ప్రారంభమైన ఎంపీపీ కప్ క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీలను బుధవారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీలు గురువారంతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఎంపీడీవో శశికళ, ఎంఈవో మనుకుమార్, సర్పంచ్‌లు భిమేశ్, బాపురావు తదితరులు ఉన్నారు.

జంగుబాయి వేడుకలకు సౌకర్యాలు కల్పిస్తాం

జంగుబాయి వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీడీ రమాదేవి, ఎంపీడీవో మహేందర్

కెరమెరి, జనవరి 10: ఆదివాసీల పుణ్యక్షేత్రం జంగుబాయి వేడుకలకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి అన్నారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే వేడుకలను పురస్కరించుకొని బుధవారం ఎంపీడీవో మహేందర్‌తో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. నెల రోజుల పాటు జరిగే వేడుకలకు కావాల్సిన సౌకర్యాలను గుర్తించి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మవారిని దర్శించేందుకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ప్రస్తుతం రోడ్డు, విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ తాగునీటి వసతి లేకపోవడంతో పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందించేలా చూస్తామని,ప్రత్యామ్నయంగా ట్యాంకర్లను సైతం అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆదివాసులు దైవదర్శనానికి పెద్ద సంఖ్యలో రానుండడంతో ఆ ప్రాంతంలో అ పరిశుభ్రత ఏర్పడకుండాచూడాలని పేర్కొన్నారు. ఐటీడీఏ, ఆర్‌డబ్లుఎస్ ఏఈలు నజీమొద్దీన్, విశ్వేశ్వర్, ముకదాంగూడ సర్పంచ్ లింబాదాస్‌తో కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా చూడాలి

కౌటాల, జనవరి 10 : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో తప్పులు దొర్లకుండా చూడాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే కార్యక్రమాలు లబ్ధిదారులకు అందాలంటే లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో సరిగా నమోదు చేయాలని సూచించారు. గడువులోగా అన్ని దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రేషన్ దుకాణాల నిర్వహణ, బియ్యం పంపిణీ తదితరాలపై రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో నస్రుల్ల ఖాన్, తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్ నాయక్, శ్రీనివాస్, శ్యాంలాల్, ఎంపీవో మానిక, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్ తదితరులు ఉన్నారు.

కౌటాల: దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

విద్యతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

వాంకిడి:భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ విమలాబాయి

వాంకిడి, జనవరి 10: విద్యతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని వాంకిడి ఎంపీపీ ముండే విమలాబాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమగ్ర ఆరోగ్య శిబిరంలో విద్యార్థుల ఆరోగ్యంలోని లోపాలను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థినులు ఆరో గ్యం కోసం పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే బృందం సభ్యులు విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్వో పద్మ, ఆర్‌బీఎస్‌కే నరేందర్, హెల్త్ అసిస్టెంట్ రోహిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **గంగాపూర్ కేజీబీవీలో వైద్య శిబిరం**

రెబ్బెన, జనవరి 10: మండలంలోని గంగాపూర్ గ్రామ శివారులో గల కేజీబీవీలో బుధవారం బేటీ బచావో బేటీ పవో కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించామని కేజీబీవీ ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ రజిత అన్నారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. వైద్య శిబిరాన్ని గంగాపూర్ ఎంపీటీసీ హరిత సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ల్యాబ్ టెక్నిషియన్ మహేందర్, ఫార్మాసిస్ట్ సాగర్, ఏఎన్ఎం శాంతబా యి, అధ్యాపకులు హిమబిందు, పుష్పలత, లక్ష్మి, పుష్ప, మౌనిక, జహేరాబాను, పాఠశాల ఏఎన్ఎం సరోజ, అకౌంటెంట్ జ్యోతి, పీఈటీ స్వప్న పలువురు ఉన్నారు.

- **బెజ్జూర్ మండలంలో..**

బెజ్జూర్, జనవరి 10 : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో బుధవారం నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది హెల్త్ చెకప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ జబ్బులున్న వారికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, వైద్యాధికారి సుజాత, ల్యాబ్ టెక్నిషియన్ దిలీప్ కుమార్, ఎస్‌వో అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- **బేటి బచావో బేటి పడావోను విజయవంతం చేయాలి**

కెరమెరి, జనవరి 10 : విద్యార్థినుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సునంద అన్నారు. బుధవారం మండలంలోని మోడి కేజీబీవీలో మెగా హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థినులకు రక్త, కాలేయం, కిడ్ని, థైరాయిడ్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహిస్తామన్నారు. మోడి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని సువర్ణలత, కేజీబీవీ ప్రత్యేక అధికారి మీనా అంగన్‌వాడీ టీచర్, ఆశవర్కర్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి

బెజ్జూర్, జనవరి 10: క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎస్ఐ విక్రమ్ అన్నారు. బుధవారం మండంలోని ఎల్కపల్లిలో స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహించిన పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను నిర్వహించడం చాలా మంచి విషయమన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతోపాటు బాడీ ఫిట్నెస్ పెరిగి ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొర్తెటి రవి, నాయకులు సామల తిరుపతి, కొండ్ర మనోహర్‌గౌడ్, భాస్కర్ రాజు, ప్రవీణ్ రావు, ఉమ్మెర బాలకృష్ణ, మెస్రం రాజారాం, జావీద్ అలీఖాన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బెజ్జూర్, జనవరి 10 : మండల కేంద్రానికి చెందిన సెండె కోటేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో బుధవారం మండల బీజేపీ నాయకులు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ